

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం,17 ఆగస్టు 2025

8 పేజీలు


## చేనేత కార్మికుల కష్టాలు తీరుస్తాం

- చేనేత రంగానికి పూర్వ వైభవం తెస్తాం
- సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తా
- నేతన్నల సమస్యలపై మంత్రి సుభాష్ అధికారులతో సమీక్ష సమావేశం



**రామచంద్రపురం,మేజర్‌న్యూస్ :** చేనేత రంగానికి పూర్వ వైభవం తీసుకొచ్చి, వారి బతుకుల్లో నూతన వెలుగులు తీసుకొస్తామని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టిసుభాష్ వెల్లడించారు. శనివారం కె.గంగవరం మండలంలోని అద్దంపల్లి గ్రామంలో చేనేత జౌళిశాఖ అధికారులు, వివిధ బ్యాంకుల అధికారులతోనూ, చేనేత సంఘాల కార్మికులతోను మంత్రి సుభాష్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మొదట చేనేత కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలను సావధానంగా విన్నారు. అనంతరం మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యం చేసిన చేనేత రంగానికి ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు జవసత్వాలు తీసుకొచ్చేందుకు మగ్గానికి 200,మరమగ్గానికి 500 యూనిట్లు విద్యుత్‌రాయితీని ప్రకటించడంతో నేతనాలకు మేలు జరుగుతుందన్నారు. ఈసందర్భంగా పలువురు చేనేత సంఘాల నాయకులు పలు సమస్యలు మంత్రి సుభాష్ దృష్టికి తీసుకువచ్చారు. త్రిఫ్ట్ రుణాలు మంజూరు చేస్తూ ఆప్కో ద్వారా విక్రయాలు మరలా పునరు ద్ధరించేలా చర్యలు చేపట్టడంతో పాటు, డ్రాయల్ లిమిట్ 75% నుంచి 90 శాతానికి పెంచాలని, ఆప్కోలో పెండింగ్లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు నేతన్న నేస్తం కింద రూ.25 వేలు ఆర్థిక సహాయాన్ని వెంటనే ఇచ్చేలా కృషి చేయాలన్నారు. వెంటనే మంత్రి సుభాష్ స్పందిస్తూ చేనేత కార్మికులు కూటమి ప్రభుత్వానికి వెన్నెముకగా నిలిచారని వారి సంక్షేమానికి అన్ని విధాలుగా ముఖ్య మంత్రి ప్రత్యేక చొరవతో కృషి చేయడం జరుగుతుందన్నారు. అలాగే 50 ఏళ్ల వయసు పైబడిన నేతన్నలకు రూ.4 వేల పింఛన్ ఇస్తున్నామన్నారు. నూలు కొనుగోలుపై సబ్సిడీ, క్లస్టర్ టెక్స్టైల్ పార్క్ అభివృద్ధి,

- తరువాయి 2లో..

## అణగారిన వర్గాల ఆశాజ్యోతి
## సర్దార్ గౌతు లచ్చన్న

- జిల్లా కలెక్టర్ షణ్మోహన్



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** స్వాతంత్ర సమరయోధుడు, సంఘసంస్కర్త, అణగారినవర్గాల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు సర్దార్ గౌతు లచ్చన్న అని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్..జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారులతో కలిసికాకినాడ తన క్యాంపు కార్యాలయంలో సర్దార్‌గౌతు లచ్చన్న 116వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- తరువాయి 2లో..

## గౌతు లచ్చన్న పోరాట పటిమ మార్గదర్శకం

- లచ్చన్న కుటుంబంతో మా కుటుంబానికి అనుబంధం
- నగరంలో దామాషా ప్రకారం బిసిలకు పదవులు ఇస్తున్నాం
- గౌతు లచ్చన్న జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ప్రసిద్ధ స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రముఖ రాజకీయ నాయకుడు గౌతు లచ్చన్న పోరాట పటిమ మనకే కాదు, భవిష్యత్తు తరాలకు కూడా మార్గదర్శకం అని రాజమహేంద్రవరం నగర ఎమ్మెల్యే శ్రీ ఆదిరెడ్డి శ్రీనివాస్(వాసు) అన్నారు. గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా కూటమి ఆధ్వర్యం లో అధికారికంగా స్థానిక వై జంక్షన్‌లోని గౌతు లచ్చన్న విగ్రహం దగ్గర జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసు పాల్గొని పూలమాలవేసి నివాళులర్పిం చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ తరువాత "సర్దార్" అనే గౌరవ బిరుదు పొందిన ఏకైక తెలుగు నాయకుడు లచ్చన్న అని అన్నారు.

- తరువాయి 2లో..



## రామచంద్రపురం నియోజకవర్గాన్ని
## కాకినాడ జిల్లాలో విలీనం చేయాలి

- అఖిల పక్ష జాయింట్ యాక్షన్ కమిటీ తీర్మానం



**రామచంద్రపురం,మేజర్‌న్యూస్ :** రామచంద్రపురం నియోజకవర్గ అఖిల పక్ష జాయింట్ యాక్షన్ కమిటీ (జె.ఏ.సీ) సమావేశం రామచంద్రపురంలో కామ్రేడ్ చెలికాని రామారావు స్మారక భవనంలో జరిగింది. ఈ సమావేశంలో రామచంద్రపురం నియోజక వర్గాన్ని కాకినాడ జిల్లాలో విలీనం చేయాలని ఏకగ్రీవంగా ఒక ముఖ్య తీర్మానం ఆమోదించారు. ఈ సమావేశానికిప్రముఖన్యాయవాదిమాగాపు అమ్మిరాజు అధ్యక్షత వహించారు. రామచంద్రపురం టీడీపీ సీనియర్ నాయకులు గరికిపాటి సూర్య నారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు

- తరువాయి 2లో..




# ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు





రంపచోడవరం, మేజర్ న్యూస్ : రంపచోడవరం జీవీకే పాఠశాల వద్ద, రంప రోడ్ లోని కృష్ణుడు ఆలయం వద్ద కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం కృష్ణాష్టమి సందర్భంగా జీవీకే పాఠశాల నుండి అంబేద్కర్ సెంటర్ వరకు పిల్లలతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక రామాలయం వద్ద పిల్లలతో కోలాట కార్యక్రమం చేపట్టారు. అనంతరం పాఠశాల వద్ద ఉట్టిని ఏర్పాటు చేసి పిల్లలచే ఉట్టిని కొట్టించారు. ఈ సందర్భంగా పాఠశాల పిల్లలు రాధాకృష్ణ వేషధారణలో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో హిందూ ధర్మ ప్రచారకులు గుడ్లఅంక శ్రీనివాస్ రెడ్డి, నల్లమిల్లి రామారెడ్డి, అర్చకులు అద్దంకి వెంకటేశ్వరరావు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం డివిజన్ కేంద్రంలో విశ్వహిందూ పరిషత్ జీవీకే అప్పర్ ప్రైమరీ స్కూల్ కరస్పాండెంట్ భావన్నారాయణ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, సిబ్బంది, స్కూల్ కమిటీ సభ్యులు పాల్గొనగా అర్చకులు అద్దంకి వేంకటేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు గోపికలుగా, కృషుడుగా వేషధారణలతో కోలాట నృత్య ప్రదర్శన చేసి ఉత్సాహంగా ఉట్టు కొట్టారు. అధిక సంఖ్యలో భక్తులు, వి.హెచ్.పి. రంపచోడవరం జిల్లా, మండల కార్యవర్గం, జిల్లా కార్యదర్శి అన్నవరెడ్డి కృష్ణకిశోర్, నల్లమిల్లి వేంకట రామారెడ్డి, గుప్తా, యర్రా ఆనందరావు, వెలిశెట్టి వీరభద్రం, కె.చక్రపాణి, జొన్నలగడ్డ బాలయ్య, కారం సత్యవేణి, వేంకటలక్ష్మి పాల్గొన్నారు.రంప రోడ్‌లో శ్రీ రాధాకృష్ణ ఆలయంలో గంగుల త్రిమూర్తులు ఆధ్వర్యంలో ఆలయకమిటి సభ్యులు అర్చకులు అద్దంకి శశాంక శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదములు స్వీకరించారు. సంత మార్కెట్‌లో శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో గణేశ్ రాధాక్రిష్ణ సత్సంగ సభ్యులు ఆధ్వర్యంలో అర్చకులు శ్రీ లింగాల సీతారామాంజనేయశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అత్యంత ఉత్సాహంగా బాలలు, యూత్, అందరూ లాయర్ భగవాన్ ఆధ్వర్యంలో ఎస్‌టి కాలనీలో, సి క్వార్టర్స్ గణపతి ఆలయ యూత్ కమిటీ ఆధ్వర్యంలో యూత్ సభ్యులు ఉట్టు కొట్టారని రంపచోడవరం ధర్మ ప్రచార భక్త మండలి కో–ఆర్డినేటర్ నల్లమిల్లి వేంకటరామారెడ్డి తెలియజేసారు.

## ఆదిత్య యూనివర్సిటీలో ఘనంగా 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**గండేపల్లి, మేజర్ న్యూస్ :** గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో 79 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వందేమాతరంతో ప్రారంభమైన కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రో.ఛాన్సలర్ డా. నల్లమిల్లి సతీష్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జెండా వందనం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డా. ఎం. శ్రీనివాసరెడ్డి, వైస్ ఛాన్సలర్. డా.ఎం.బి.శ్రీనివాస్,ప్రో. వైస్ ఛాన్సలర్. డా.ఎస్. రమాశ్రీ,డా. రవి తంగజన్, రిజిస్ట్రార్ డా. జి.సురేష్, డీన్. డా. డి.కిషోర్, డీన్. స్కూల్ ఆఫ్ ఫార్మసి డా. డి. సతీష్ కుమార్, హాస్టల్ ఇంచార్జ్ జి. హరీష్ రెడ్డి, చక్రవర్తి, డా. విజయ్ రెడ్డి, హాస్టల్ వార్డెన్లు సరిత,ప్రసాదరావు, ఫిజికల్ డైరెక్టర్. డా. రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన ఎందరో మహానుభావులు కృషి ఫలితమే నేటి ఈ స్వాతంత్ర్యము అని వారి త్యాగాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల దేశభక్తి గీతాలు ఎంతో ఆకట్టుకున్నాయి.. ఎన్.సి.సి. మరియు యూనివర్సిటీ సెక్యూరిటీ సిబ్బంది వందన సమర్పణ కావించగా విద్యార్థుల నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. టెక్నికల్ హబ్ విద్యార్థులచే రూపొందించిన ఈ–వేస్ట్‌తో రూపొందించిన ఎయిర్ క్రాఫ్ట్ తదితర వస్తువులు, డ్రోన్‌తో జాతీయ జండా ప్రదర్శన ఆకట్టుకుంది. వివిధ పోటీలలో విజేతలకు మెడల్స్, బహుమతి ప్రధానం జరిగింది. కార్యక్రమం అనంతరం మిఠాయిలు పంచి పెట్టారు.

# గౌతు లచ్చన్న పోరాట పటిమ మార్గదర్శకం

మొదటిపేజి తరువాయి

గత ఐదేళ్లు వైసిపి పాలనలో బీసీలను పట్టించుకోలేదు సరికదా, ప్రజా నాయకుడైన గౌతు లచ్చన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలన్న కనీస ఆలోచన కూడా వారికి రాలేదని ఆయన ఎద్దేవా చేసారు. కూటమి ప్రభుత్వం లచ్చన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించి, జీవో కూడా ఇచ్చిందని ఆయన అన్నారు.గౌతు లచ్చన్న కుటుంబానికి, మా కుటుంబ సభ్యులకు సన్నిహిత సంబంధం ఉందని ఆయన ప్రస్తావించారు. లచ్చన్నతో మా మామయ్య... కేంద్ర మాజీ మంత్రి స్వర్గీయ కింజరాపు ఎర్రన్నాయుడు, కలిసి పని చేశారని,వారిద్దరికీ అత్యంత సన్నిహిత సంబంధం ఉందని ఎమ్మెల్యే వాసు చెప్పారు. ఇక లచ్చన్న కుమారుడు గౌతు శ్యామ్ సుందర్ శివాజీతో మానాన్న ఆదిరెడ్డి అప్పారావు ఎమ్మెల్సీగా ఉన్నపుడు కల్సి పనిచేశారని ,ఇప్పుడు నేను, లచ్చన్న మనవరాలు గౌతు శిరీష శాసన సభలో ఉన్నామని ఎమ్మెల్యే వాసు గుర్తుచేశారు. మూడు తరాలుగా ఒకే కుటుంబంతో ఇలా అనుబంధం ఉండడం ఆనందంగా ఉందన్నారు. గీత కులాలకు ఆరాధ్యదైవం అయిన గౌతు లచ్చన్న జయంతిని అధికారికంగా నిర్వహించడం జరుగుతోందని ఎమ్మెల్యే వాసు పేర్కొన్నారు.ఇది బిసి జాతి బిడ్డలుగా మనందరికీ గర్వకారణమన్నారు. కూటమి ప్రభుత్వానికి ఆయన పట్ల, బీసీ కులాల పట్ల ఉన్న చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమన్నారు. మహనీయులు అందరివారని అయన అన్నారు. మేయర్‌గా తన తల్లి వీరరాఘవమ్మ ఉన్నపుడు ఇక్కడ విగ్రహ ఏర్పాటులో అప్పటి కాంగ్రెస్ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, అప్పటి ఎంపీ ఉండవల్లి అరుణ కుమార్ అందరినీ కలుపుకుని ఈ విగ్రహం పెట్టించడానికి సహకారం అందించారని, మహనీయుల పట్ల అందరూ ఐక్యంగా పని చేయాలన్నదానికి ఇది తార్కాణమని ఎమ్మెల్యే వాసు అన్నారు. ఇప్పుడు కూటమి తరపున ఐక్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. నివాళి అంటే జయంతి వర్ధంతి చేయడం ఒక్కటే కాదని వారి ఆశయాలను కూడా ఆచరణలో పెట్టాలని అన్నారు. మద్యం దుకాణాలు, బార్ల ఏర్పాటుల్లో 10 శాతం రిజర్వేషన్లు గీతకులాలకు కల్పించడం జరిగిందని ఆయన గుర్తుచేసారు. ఇది బీసీలకు ఇచ్చిన గౌరవం అన్నారు. అంతటితో ఆగకుండా దామాషా ప్రకారం బిసిలకు పదవులు కూడా ఇవ్వాలని భావించి నగర టిడీపిప్రధాన కార్యదర్శిగా బుడ్డిగ రాధ, టౌన్ బిసి సెల్ అధ్యక్షులుగా బుడ్డిగ రవి, పీఎంకే సత్రం చైర్మన్ గ రెడ్డి మణి, శ్యామలాంబ అమ్మవారి ఆలయ చైర్మన్ గ కడియాల వీరభద్రరావు, అర్బన్ హెల్త్ సెంటర్ల చైర్మన్ గ రాయుడు గణేష్, చెల్లుబోయిన మూర్తిలను నియమించామని ఎమ్మెల్యే వాసు వివరించారు. ముఖ్యంగా రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గ కుడుపూడి సత్తిబాబు నియమితుల య్యారని ఆయన గుర్తుచేసారు.కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ బీసీలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే వాసు చెప్పారు. గతంలో బీసీల కోసం ఆదరణ పథకాన్ని అమలు చేసి బీసీలకు వారి వృత్తి పరమైన పని ముట్లు అందించడం జరిగిందని, అయితే ఆ తరువాత అధికారం చేపట్టిన జగన్ ఆ ఆదరణ పథకాన్ని అటకెక్కించారని ఎమ్మెల్యే వాసు విమర్శించారు. అలాగే రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, కూడా గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజానికి గౌతుల చిన్న చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికుల కష్టాలు తీరుస్తాం

మొదటిపేజి తరువాయి

చేనేత శాలల నిర్మాణాలకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతుందన్నారు. చేనేత కార్మికుల నైపుణ్యం వెలికి తీసే ఉద్దేశంతో నూతన డిజైన్లు దరఖాస్తులు ప్రభుత్వం ఆహ్వానిస్తుందన్నారు. ఒక జిల్లా ఒకే ఉత్పత్తి పథకానికి సంబంధించి కేంద్రం నుండి 26 అవార్డులు ప్రకటించగా మన రాష్ట్రానికి 9 అవార్డులు దక్కాయని వాటిలో 4అవార్డులు చేనేత రంగానికి సంబంధించి రావడం గర్వకారణమన్నారు. ఎం.ఎస్.ఎం.ఈ. పార్కులలో నేతన్నలకు ప్రత్యేకయూనిట్లు కేటాయించడం జరిగిందన్నా రు.ఒకవైపు నేతన్నలకు సంక్షేమ పథకాలు అందిస్తూనే చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ నదుపాయం కల్పించి వారి ఆర్థిక ఉన్నతికి వెన్నుదన్నుగా నిలుస్తోందన్నారు. వ్యవసాయం తరవాత అత్యధిక మంది చేనేత రంగంపై అధారపడి జీవిస్తున్నారన్నారు. దేశ సామాజిక, ఆర్థిక నుస్థిరాభివృద్ధికి చేనేత పరిశ్రమ ఊతం ఇచ్చిందని, వారి కష్టసుఖాల్లో కూటం ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. స్వతంత్ర భారతంలో చేనేత హస్త కళలకు ప్రాధాన్యత చాలా ఎక్కువన్నారు. నేతన్న కళ్లల్లో సంతోషం వర్షించాలంటే అయా కుటుంబాలు ఆర్థికంగా బలపడాలన్నారు. నాటి చేనేత పరిశ్రమ తక్కువ పెట్టుబడి, స్వల్ప శక్తి వినియోగం, కాలంతో పాటు వస్తున్న మార్పులకు అనుగుణంగా తమ డిజైన్లను మార్చడం లాంటివి సానుకూల అంశాలుగా చేసుకొని మార్కెట్లో డిమాండ్ ఉన్న చేనేత వస్త్రాల తయారీపై దృష్టి పెట్టి జీవనోపాదులను మెరుగు పరుచుకోవాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం అందించే సహాయ సహకారాలను సకాలంలో ఇస్తూ అన్ని విధాలుగా అండగా భరోసాగా నిలుస్తామన్నారు. ఈ కార్యక్ర మంలో డిసిసిబి బ్యాంక్ సీఈవో ప్రవీణ్ కుమార్, చేనేత జౌళి శాఖ జిల్లా అధికారి పెద్దిరాజు, అభివృద్ధి అధికారి కె.గంగరాజు, సహాయ అభివృద్ధి అధికారి ఏ.వెంకటేశ్వర రావు, డిసిసిబి బ్యాంక్ ద్రాక్షారామ బ్రాంచ్ మేనేజర్ మాణిక్యాంబ దేవి, నోడల్‌అధికారులు,అద్దంపల్లి,శివల,హసనాబాద్, ఆదివారపు పేట సొసైటీలకు చెందిన చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## అణగారిన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న

మొదటిపేజి తరువాయి

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల అభ్యున్నతి, రైతుల సంక్షేమం, కార్మికుల హక్కుల కోసం గౌతు లచ్చన్న వీరోచిత పోరాటం చేశారన్నారు. స్వాతంత్ర ఉద్యమ పోరాటంలో చురుకుగా పాల్గొని శ్రీకాకుళం, విజయనగరం ఇతరప్రాంతాల ప్రజలను చైతన్య వంతులను చేయడంలో ప్రధాన పాత్ర పోషించారన్నారు. వెనుకబడిన వర్గాల ప్రజలను చదువుకునేలా ప్రోత్సహించేందుకు హాస్టళ్ళు, పాఠశాలలు ఏర్పాటు చేశారని ఆయన తెలిపారు. భావితరాలకు సర్దార్ గౌతు లచ్చన్న జీవితాన్ని ఆదర్శంగా నిలుస్తుందని ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమములో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఎం.లిల్లి, బీసీ కార్పొరేషన్ ఈడీ ఏ.శ్రీనివాసరావు, సహాయ బీసీ. సంక్షేమాధికారి పి.రామ క్రిష్ణ, డబ్ల్యూహెచ్వోలు బహుదూర్, వై. కల్పన, కారపు సూర్య శివ ప్రసాద్, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో విలీనం చేయాలి

మొదటిపేజి తరువాయి

ఉండవిల్లి గోపాల్ రావు, వైఎస్ఆర్ పార్టీ పట్టణ అధ్యక్షులు గాధంశెట్టి శ్రీధర్, జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు గొల్లపల్లి కృష్ణ, సీనియర్ న్యాయవాదులు గాలింకి చిట్టిబాబు, దొమ్మల పాటి సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఖాన్, విక్టర్ నంద, వైఎస్ఆర్ షర్మిల పార్టీ అధ్యక్షులు కోట శ్రీనివాస్, రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో విలీనం ప్రజల సౌలభ్యం, పరిపాలనా సదుపాయాలు, అభివృద్ధి దృష్ట్యా ఈ విలీనం అత్యవసరం అని జె.ఏ.సీ పేర్కొంది.జె.ఏ.సీ నాయకులు సమావేశంలో స్పష్టం చేశారు.జె.ఏ.సీనాయకులు మరింతగా పేర్కొంటూ సోమవారము నుండి సంబంధిత అధికారులకు, ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు సమర్పిస్తామని తెలిపారు. ప్రజల ఆకాంక్ష నెరవేర్చే వరకు నిరంతర పోరాటం కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు. రామచంద్రపురం ప్రజల సమిష్టి కృషితో ఈ ఉద్యమాన్ని విజయవంతం చేసి, కాకినాడ జిల్లాలో విలీనం సాధించడమే జె.ఏ.సీ లక్ష్యం అని సమావేశంలో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో పీ.డీ.ఎస్.యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏ.రీశ్వంత్ రాయ్, టిడిపి నాయకులు బాబూరావు, సీపీఐ నాయకులు పి.రాము, సీపీఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు వి.భీమాశంకరం, టిడిపి పార్టీ నాయకులు బలరాం, టీడీపీ నాయకులు నాయుడు మాస్టర్, లాయర్స్ కమలకుమారి, హరినాద్, రాష్ట్ర వి.ఆర్.ఓ సంఘాల అధ్యక్షులు బాపూజీ, వామపక్ష పార్టీ నాయకులు అంబటి కృష్ణ, శారద, తోట సూరిబాబు, నవీన్, నాగరాజు, రాజారెడ్డి, విలేకర్లు వెంకటరమణ, ప్రసాద్, జనసేన నాయకులు నల్లా బ్రదర్స్,టీడీపీ నాయకులు శిరిగినీడి దుర్గా ప్రసాద్, దాసు, తదితరులు పాల్గొన్నారు.

# సమస్య పరిష్కరిస్తామని నోట్లో మట్టి కొట్టారు!

**– నరసాపురం క్వారీ బాధితులు ఆవేదన**



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రంపచోడవరం మండలం నర్సాపురం క్వారీ సమస్య పరిష్కరిస్తామని వచ్చి, అధికారులు తమ నోట్లో మట్టి కొట్టారని క్వారీ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తప్పుడు దర్యాప్తులు చేసి సంతకాలు పెట్టాలని ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. రంపచోడవరం తాసిల్దార్, రెవిన్యూ ఇన్స్పెక్టర్, వీఆర్వో పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని నర్సాపురం బ్లాక్ మెటల్ క్వారీ పై ఫిర్యాదు చేసిన నరసాపురం గ్రామ ఫిర్యాదుదారులు డిమాండ్ చేసారు. గ్రామంలోకి వచ్చి తమ ఫిర్యాదు పై గ్రామసభ నిర్వహించి సమస్య పరిష్కరిస్తామన్న రెవెన్యూ అధికారులు తమ నోట్లో మట్టి కొట్టారని నరసాపురం మెటల్ క్వారీపై ఫిర్యాదు చేసిన బాధితులు ఆవేదన వ్యక్తపరిచారు. నరసాపురం మెటల్ క్వారీపై చర్యలు తీసుకోవాలని, నిధులు అవకతవకలపై విచారణ జరపాలని గత మే నెలలో ఫిర్యాదు చేస్తే మొదట రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో గత సబ్ కలెక్టర్ సమక్షంలో దర్యాప్తు జరిపారని, ఆ సమయంలో గత సబ్ కలెక్టర్ అక్రమణదారులకే కొమ్ముకాస్తూ మాట్లాడారని, ఆ తర్వాత ఆగస్టు 6వ తేదీన రంపచోడవరం ఎమ్మార్వో కార్యాలయంలో విచారణ జరిపారని, ఆరోజు ఎమ్మార్వో నరసాపురం గ్రామానికి వచ్చి గ్రామసభ నిర్వహించి ఫిర్యాదుపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని, దానికి అనుగుణంగా ఆగస్టు 14వ తేదీన నర్సాపురం గ్రామంలో గ్రామసభ నిర్వహించడం జరిగిందన్నారు. గ్రామసభలో రంపచోడవరం మండల తాసిల్దార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్, విఆర్ఓ, ప్రజలు పాల్గొన్నారని తెలిపారు. ఆ సమయంలో క్వారీ నిర్వహణాదారులు ఎవరు దరఖాస్తులో పేర్కొన్న విధంగా నిధులు అవకతవకలపై సరైన లెక్కలు చూపించలేదన్నారు. అదేవిధంగా వచ్చిన అధికారులు క్వారీ వల్ల జరుగుతున్న నష్టం గురించి, నిధులు గురించి చర్చించలేదన్నారు. ఇవేమీ జరగకుండానే తూతూ మంత్రంగా గ్రామసభ పెట్టి బలవంతంగా సంతకాలు చేయాలని ఒత్తిడి చేశారని, అయితే ఫిర్యాదుదారులు ఎవరు సమస్య పరిష్కారం అయ్యేవరకు సంతకాలు చేయమని తెలియజేయడంతో ఈ సమస్యపై ఆఫీసుకు వస్తే అప్పుడు మీ సంగతి చెప్తామని ఆర్ఐ, విఆర్ఓ అన్నారని వారు తెలియజేశారు. క్వారీ ఫిర్యాదుదారులమైన తాము ఇళ్ళకు వెళ్లిపోయిన తర్వాత అధికారులు క్వారీ నిర్వహణదారులుతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి, వారితో కుమ్మక్కై ఫిర్యాదుదారులు, క్వారీ నిర్వహణదారులు ఊర్లో చర్చించుకుంటామని తప్పుడు నివేదిక రాసి, ఇంతటితో ఈ సమస్య పరిష్కారం అయిందని రాత్రిపూట వచ్చిన వీఆర్వో తమ చేతిలో నోటీసు ఇచ్చి వెళ్లిపోయారని వారు వివరించారు. ఫిర్యాదులో పేర్కొన్న విధంగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని వచ్చిన అధికారులు అక్రమార్కులకు లొంగిపోయి తమ నోట్లో మట్టి కొట్టి వెళ్లారని వారు ఆవేదన వ్యక్తపరిచారు.

తాసిల్దార్, ఆర్ఐ, విఆర్ఓ పై ఫిర్యాదు చేస్తామని, అలాగే క్వారీ సమస్యపై మరోసారి ఐటీడీఏ పిఓ, సబ్ కలెక్టర్, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. అప్పటికి ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోతే దీనికి సంబంధించిన అధికారులతో సహా అందరిపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని వారు తెలియజేశారు. నరసాపురం మెటల్ క్వారీపై జరుగుతున్న కుట్రలు, అధికారుల నిర్లక్ష్యం పై ప్రభుత్వం స్పందించాలని వారు డిమాండ్ చేశారు. అక్రమార్కులు, అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఫిర్యాదుదారులమైన తాము ఎక్కడ సంతకం చేయలేదని, ఎక్కడ రాజీ పడలేదని అధికారులే రాజీ పడ్డట్టు తప్పుడు నివేదికలు తయారుచేసి తమ సమస్య పరిష్కారమైనట్లు నోటీస్ ఇచ్చి వెళ్ళిపోయారని, ఇది అత్యంత దారుణమైన విషయమన్నారు. ఈ సమస్యను ఇంతటితో వదిలిపెట్టబోమని, అక్రమాలతో నడుస్తున్న మెటల్ క్వారీ పై చర్యలు తీసుకునే వరకు, నిధులు దుర్వినియోగంపై చర్యలు తీసుకునే వరకు, అలాగే క్వారీ వల్ల నష్టపోయిన గ్రామ ప్రజలకు, రైతులకు న్యాయం జరిగే వరకూ ఉద్యమాన్ని ఆపమని నర్సాపురం క్వారీ బాధితులు పొడియం అరుణకుమారి, కోటం పండమ్మ, కోసు దేవి, శ్రీదేవి, సారపు దుర్గా భవానీ, చోడి అనిల్ కుమార్ దొర పేర్కొన్నారు.

# 20న శ్రీమత్ ఆంధ్ర వేద శాస్త్ర పరిషత్ 71వ వేద సభ

**కాకినాడ, మేజర్ న్యూస్ :** శ్రీమత్ ఆంధ్ర వేద శాస్త్ర పరిషత్ 71వ వసంతాల వేద సభ ఈనెల 20వ తేదీ మధ్యాహ్నం రెండున్నర గంటల నుండి స్థానిక రామారావుపేటలో నున్న గాయత్రి మండపము నందు జరుగుతుందని పరిషత్ అధ్యక్షులు బ్రహ్మశ్రీ శ్రీరామ భగవతి, కార్యదర్శి చల్లా ఫంక్షన్ హాల్ అధినేత చల్లా శ్రీనివాస్ నిరంజన్ సంయుక్తంగా విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. రాజమండ్రి శ్రీ దత్తాత్రేయ వేద గురుకుల ప్రధానోపాధ్యాయులు, భారత జ్యోతి అవార్డు గ్రహీత గొల్లపల్లి సీతారామచంద్ర ఘనాపాఠి ఆధ్వర్యంలో వేద స్వస్తి కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. ఉపన్యాసకులుగా రాష్ట్రపతి అవార్డు గ్రహీత మహా మహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ పాల్గొంటున్నారని, ముఖ్య అతిథులుగా పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, శాసనసభ్యులు వనమాడి కొండబాబు, ఏపిటిఐడిసిఓ చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్‌లు పాల్గొంటున్నారని వారు తెలిపారు. ఇతర వివరాలకు 98491 43524, 99123 06322లో సంప్రదించవచ్చునన్నారు.

# ప్రజా చైతన్యంతోనే స్వాతంత్ర్య ఉద్యమం సాకారం




**– యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు**

**కాకినాడ, మేజర్ న్యూస్ :** ప్రజా చైతన్యంతోనే స్వాతంత్ర్య ఉద్యమ స్వప్నాలు సాకారం అవుతాయని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. కచేరి పేట యుటిఎఫ్ హెూంలో రఘుపతి వెంకటరత్నం నాయుడు స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో "78 ఏళ్ల స్వతంత్ర భారతం – స్వప్నాలు – సాకారాలు" అనే అంశంపై సదస్సు నిర్వహించారు. యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ వాసంశెట్టి సోనీ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో వెంకటేశ్వర్లు ముఖ్యవక్తగా ప్రసంగించారు. వాస్కోడిగామా భారతదేశంలో అడుగుపెట్టిన నాటి నుండి 1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం వరకు బ్రిటిష్ కంపెనీ పాలనపై వివిధ రూపాల్లో ప్రజలు పోరాడారని తెలిపారు. 1947 స్వాతంత్ర సాధన ఉద్యమం అనేక స్రవంతులుగా జరిగిందన్నారు. అనేక మతాలు, కులాలు, సాంప్రదా యాలు, భాషలు కలిగిన ప్రజలంతా మనమంతా భారతీయులమే అనే గొప్ప స్ఫూర్తితో ఉద్యమ సాగించారని పేర్కొన్నారు. వారి ఆకాంక్షలకు అనుగుణంగా భారత రాజ్యాంగం రూపొందించబడినదని తెలిపారు. పాలకులు విఫలమైనప్పుడు ప్రజా చైతన్యమే దేశాన్ని సరైన మార్గంలో నడిపిస్తుందన్నారు. ఆ విధంగా స్వాతంత్ర ఉద్యమ స్వప్నాలను సాకారం చేసుకోవాని నారాయణ అన్నారు. ఈ సదస్సులో అంబేద్కర్ ఉద్యమ నేత అయితాబత్తుల రామేశ్వరరావు, యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకర్ వర్మ తదితరులు మాట్లాడుతూ స్వాతంత్ర పోరాట అమరవీరుల స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.జి.సూరిబాబు సదస్సుకు ఆహ్వానం పలుకగా జె.వి.వి. జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఎస్.వర్మ వందన సమర్పణ చేశారు. కొండలరావు అభ్యుదయ గీతాలు ఆలపించారు.

# రోగులకు, గర్భిణీ స్త్రీలకు పండ్లు పంపిణీ



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రంపచోడవరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పాస్టర్స్ ఫెలోషిప్ వారు రోగులకు, గర్భిణీ స్త్రీలకు పండ్లు పంపిణీ చేసారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవటం, కష్టాల్లో ఉన్నవారిని కనికరించటం వారి యెడల మనకు తోచిన సహాయం అందించటమే నిజమైన స్వాతంత్ర్యం అని రంపచోడవరం పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ రెవ టి.ప్రభుదాస్ పేర్కొన్నారు. 79వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా రంపచోడవరం పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్యం పొందుతున్న రోగులకు, గర్భిణీ స్త్రీలకు సుమారు వంద మందికి పండ్లు పంపిణీ చేసి, వారి కొరకు పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఫెలోషిప్ ప్రెసిడెంట్ టి.ప్రభుదాస్ మాట్లాడుతూ ఎందరో మహానుభావులు చేసిన త్యాగాల ఫలితమే ఈ స్వాతంత్ర్యం మని, దీనిని ప్రతిఒక్కరు గుర్తించాలన్నారు. అలాంటి మహనీయుల త్యాగాల వలన నేడు మనమందరం స్వేచ్ఛ వాతావరణంలో జీవిస్తున్నామన్నారు. అలాగే ప్రపంచ మానవాళి పాప విమోచన కొరకు యేసుక్రీస్తు సిలువలో మరణించారని గుర్తు చేశారు. ప్రత్యేకించి రోగుల కొరకు మండల పాస్టర్స్ ఫెలోషిప్‌లో అనునిత్యం ప్రార్థనలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు బిషప్ టి.మోజేష్, కార్యదర్శి బి.కృపారావు, కోశాధికారి కె.సంజీవరావు, గౌరవ అధ్యక్షుడు రెవ ఎన్.ప్రభుదాస్, దైవ సేవకులు పాల్గొన్నారు.

## రక్త పరీక్ష కిట్లు అందుబాటులో ఉంచాలి

**– విలీన మండలాల ప్రజలను రోగాల బారినుండి కాపాడండి**

**– కలెక్టర్‌కు రాంబాల నాగేశ్వరరావు వినతి**



**ఎటపాక,మేజర్‌న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండల పరిధిలో గల ప్రభుత్వ వైద్య శాలలో రక్త పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయాలనీ అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ కు, ఐటీడిఏ పిఓ అపూర్వ భారత్‌కి,డిఎంఎచ్ఓ పుల్లయ్యకి వైసీపీ సీనియర్ నాయకులు రంభాల నాగేశ్వరావు ఓ ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్మీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వం వారు ఇద్దరు డాక్టర్లు నియమించడం చాలా సంతోషంగా ఉందని, కానీ హాస్పిటల్‌లో ఏ విధమైన రక్త పరీక్షలు లేనందున, ఒక మలేరియా తప్ప మిగతా టెస్ట్ లేవి కూడా ఇక్కడ చేయటం లేదు అని,ఈ విషయంపై డాక్టర్‌ని అడుగగా ఇక్కడున్న రక్త పరీక్షలు చేయుటకు ఉపయోగించే పరికరాలు అందుబాటులో లేవు,అవి చేయించడానికి ఇక్కడ సాధ్యపడదని ఆయన తెలిపారని, ఇద్దరు డాక్టర్లు కూడా హాస్పిటల్లో ఉండే ప్రయోజనం లేకుండా అవుతుంది అని, ముఖ్యంగా, ఈ మధ్యకాలంలో కురుస్తున్న వర్షాల కారణంగా చుట్టుపక్కల గిరిజన ప్రాంతాల్లో విపరీతమైన జ్వరాలతో ప్రజలం దరూ బాధపడుతున్నారు అని, ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే పరిస్థితి ఈ రకంగా ఉంది దీర్ఘకాలిక రోగులకు కిడ్నీ పరీక్ష చేయడానికి గాని ఇక్కడ ఏ విధమైన రక్త పరీక్షలు లేవు అని, డెంగ్యూ సిబిపి, టైఫాయిడ్ పరీక్షలు లేవు అని,ఏజెన్సీ ప్రాంతాల్లో లక్ష్మీపురం, నెల్లిపాక, గౌరిదేవిపేట హాస్పిటల్‌లోగాని ఎక్కడ కూడా ఈ రకమైన వైద్య పరీక్షలు లేకపోవడం వలన గిరిజనులు అనేక రకమైన జబ్బులతో ప్రైవేట్ హాస్పటల్ వెళ్లి, పరీక్షలు చేయించుకొని విపరీతమైన డబ్బులు ఖర్చు చేస్తున్నారు అని, మీరు స్వయంగా చింతూరు ఐటిడిఏ పిఓ మీరు స్వయంగా లక్ష్మీపురం, నెల్లిపాక, గౌరీదేవిపేట పిహెచ్ సిలకు మీరు పర్యవేక్షించలని, మీకు హాస్పటల్లో ఉన్న పరిస్థితులు మీరు స్వయంగా చూడొచ్చు అని, దయచేసి ఏజెన్సీ ప్రాంతంలోని ప్రజలను కాపాడేందుకు త్వరగా చర్యలు చేపట్టాలని ఆయన జిల్లా కలెక్టర్‌ను, ఐటీడీఏ పీఓ ను ఆయన ఈ సందర్భంగా కోరారు.

# నిర్వాసితులకు కనీస సౌకర్యాలు కల్పించరా?






**- సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి**

**ఎం.ఎ.బేబీ ఎదుట పోలవరం నిర్వాసితులు ఆవేదన**

రంపచోడవరం, మేజర్ న్యూస్ : పోలవరం పునరావాస కాలనీలలో నిర్వాసితులకు కనీస మౌలిక సదుపాయాలు లేవని, ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత కరువైందని, ఉపాధి పనులకు వెతలు తప్పడం లేదని సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం ఎ బేబీ ఎదుట పోలవరం నిర్వాసితులు కన్నీటి పర్యంతమయ్యారు. దేవీపట్నం మండలం తాళ్లూరు, నాగులపల్లి, మంటూరు కాలనీల్లో ఎంఎ బేబీ శనివారం పర్యటించారు. నిర్వాసితుల పునరావాసం విషయంలో కనీస మానవత్వం పాటించలేదని, ఇదెక్కడి పునరావాసమని ఆయన ప్రశ్నించారు. ఇళ్లు అనడానికి వీలు లేని పద్ధతుల్లో కాలనీలు నిర్మించారని సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం ఎ బేబీ ఎదుట బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. తమ పునరావాస కాలనీలలో కనీస మౌలిక సదుపాయాలు లేవని, మరుగు దొడ్లు తక్కువ ఎత్తులో నిర్మించారని, దీంతో చిన్నపాటి వర్షాలకు నీరు నిలిచిపోవడంతో ఉపయోగించుకునే అవకాశం లేకుండా పోయిందన్నారు. మహిళలు బహిర్భూమికి బహిరంగ ప్రదేశాలకు వెళ్లవలసి వస్తుందని, ఇంటి నిర్మాణాలలో నాణ్యత లేదని, కాంట్రాక్టర్‌ను సంప్రదిస్తే తనకు సంబంధం లేదని, తన కాలపరిమితి పూర్తయిందని, దిక్కున్న చోట చెప్పుకోమని బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. అధికారులను సంప్రదిస్తే కనీస స్పందన లేదని, స్లాబులు కారిపోతున్నాయని, ఇళ్లలో ఎలా కాపురం చేయాలి అంటూ దేవీపట్నం మండలం తాళ్లూరు కాలనీకి చెందిన చదల పార్వతి ఆవేదన వ్యక్తం చేశారు. అర్హత ఉన్నా పునరావాసం కల్పించలేదని మరి కొంతమంది నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. అర్హత ఉన్నా తనకు పునరావాసం కల్పించలేదని వృద్ధురాలైన తోకల సోమాలమ్మ సిపిఎం బృందం ఎదుట కన్నీటి పర్యంతం అవుతూ తన గోడు చెప్పుకుంది. గతంలో కొండ మొదలు పంచాయతీలో నివసించేదాన్ని అని, అక్కడినుంచి బలవంతంగా తరలించారని వాపోయింది. ప్రస్తుతం తనకు పింఛను రావడం లేదని, పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందని వివరించింది. ఇదే సమస్యతో సాధన పాపయమ్మ తన ఆవేదన వ్యక్తం చేసింది. ఇంటి నిర్మాణం సగంలో ఆగిపోయిందని, ప్రభుత్వం ఎటువంటి సాయం చేయకపోవడంతో ఇంటి నిర్మాణం సగంలో ఆగిపోయింది అంటూ నాగులపల్లి కాలనీ చెందిన చదల శ్రీనివాసరెడ్డి వాపోయారు. ప్రభుత్వం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లించి పునరావాసం కల్పించలేదని, దీంతో ఆ నగదు తోనే ఇంటి నిర్మాణం ప్రారంభించి నగదు సరిపోక సగం లోనే నిర్మాణం నిలిపివేశానని వాపోయారు. తన కుటుంబంలో నలుగురు అన్నదమ్ములు ఉన్నారని, ఏ ఒక్కరికి పూర్తిస్థాయిలో పునరావాసం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కల్పించలేదని తెలిపారు. పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో తన ప్రయత్నం విరమించు కున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఏ ఒక్క ఇంటికి ప్లాస్టింగ్ చేయలేదని, నాగులపల్లి కాలనీలో 73 కుటుంబాలకు పునరావాసం కల్పించాలని, అయితే ఏ ఒక్క ఇంటి గోడకు ప్లాస్టింగ్ చేయలేదని కుంజం వెంకటలక్ష్మి తెలిపింది. రేషన్ బియ్యం కోసం 10 కిలోమీటర్లు వెళ్లవలసి వస్తుందని తెలిపింది. తాగునీటి సౌకర్యం లేకపోవడంతో ద్విచక్ర వాహనంపై సమీపంలోని గోకవరం మండల కేంద్రానికి వెళ్లి తెచ్చుకుంటున్నామని ప్రయాణ ఖర్చులతో కలిపి ఒక బాటిల్ ఖరీదు రూ.50లు పడుతుందని వాపోయింది. ఈ కాలనీలో అత్యధికమంది ఉపాధికి దూరమయ్యారని, అధికార యంత్రాంగం కనీసం గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు సైతం కల్పించడం లేదని తెలిపింది. ఇలా ఏ ఇంటి తలుపు తట్టినా పోలవరం నిర్వాసితులు తమ సమస్యలను ఏ కరువు పెట్టారు. సిపిఎం అఖిలభారత ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ, కేంద్ర కమిటీ సభ్యులు కె. లోకనాదం, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, లోతా రామారావు, వాణిశ్రీ, తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి టి. అరుణ్ స్థానిక సిపిఎం నాయకులతో కలిసి శనివారం పోలవరం నిర్వాసిత కాలనీలు తాళ్లూరు, నాగులపల్లి లలో పర్యటించారు. తాళ్లూరు కాలనీలో 240 కుటుంబాలకు, నాగులపల్లి కాలనీలో 73 కుటుంబాలకు ప్రభుత్వం పునరావాసం కల్పించింది. ఈ కాలనీలలో ఇంటింటికి సిపిఎం బృందం వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకుంది. సిపిఎం నాయకులకు సాదర స్వాగతం లభించింది. పూల జల్లులతో, హారతులతో సాంప్రదాయంగా ఆహ్వానించారు. తమ సమస్యలను విన్నవించటంతో పాటు వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎం.ఏ.బేబీ మాట్లాడుతూ ఇదెక్కడి పునరావాసం అంటూ ఆందోళన వ్యక్తం చేశారు. నిర్వాసితుల పునరావాసం విషయంలో కనీస మానవత్వం పాటించలేదు అని మండిపడ్డారు. ఇళ్లు అనడానికి వీలు లేని పరిస్థితుల్లో పునరావాస కాలనీలు నిర్మించారని విమర్శించారు.

# ఆటో యూనియన్ ఆధ్వర్యంలో పొదలు తొలగింపు



ఎటపాక,మేజర్‌న్యూస్ : అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండల పరిధిలో గల సెంటెన్స్ పాఠశాల నుంచి ఎర్రబోరు గ్రామం వరకు వెళ్లే రహదారికి ఇరువైపులా పొదలు ఏపుగా పెరిగాయి. దాంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. కావున ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ముఖ్యంగా రాత్రి సమయంలో ఆరహదారిలో ప్రయాణం చేయాలంటే ప్రయాణికులు భయపడుతూ వుండేవారు. ఇది అంత గమనించిన ఆటో యూనియన్ జెఏసి అధ్యక్షులు మర్మం శంకర్ తన మిత్ర బృందం ఆటో యూనియన్ సభ్యుల సహకారంతో శ్రమదానానికి నడుం బిగించి ఆ రహదారికి ఇరువైపులా వున్నా పొదలను తొలగించడం జరిగింది. ఆ రహదారికి ఇరువైపులా వున్నా పొదలను తొలగించడంతో రహదారిన వెళ్లే వాహనదారులు, గ్రామస్తులు, పలువురు రాజకీయ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ జెఏసి అధ్యక్షులు మర్మం శంకర్ మాట్లాడుతూ పురుషోత్తపట్నం గ్రామ పరిధిలో గల అటవీ శాఖ కార్యాలయం నుంచి ఎర్రబోరు వరకు వెళ్లే రహదారి అధ్వానంగా వుంది అని, ఆ రహదారికి ఇరువైపులా ముళ్ల పొదలు పెరిగాయని, దాంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు అని ఆయన అన్నారు. అసలే రహదారి వర్షాలకు గుంతలు పడి అధ్వానంగా వుంది అని, ఈ విషయంపై అధికారులకు, రాజకీయ నాయకులకు పలుమార్లు పిర్యాదు చేయడం జరిగింది అని, వారు పట్టించు కోవడం లేదు అని, ఇకనైనా అధికారులు స్పందించి ఈ రహదారి మరమ్మత్తులు చేపట్టాలని ఆయన కోరారు. ఈ రహదారికి ఇరువైపులా పొదలను తొలగించడంలో సహాయపడిన మిత్రులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ కార్యదర్శి కాకాని సురేష్, ఆటో యూనియన్ సభ్యులు తోట చినబాబురావు, నోముల కృష్ణ, నేరబోయిన వెంకన్నబాబు, గన్నబోయిన రాజు, జెట్టి హరి, దుద్దుకూరి రాము, కట్టాం వెంకటేష్, గోసుల రఘు, యడ్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## మరోసారి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఎంపీ సానా సతీష్ బాబు




**కాకినాడ, మేజర్ న్యూస్ :** క్రికెటర్‌గా తన ప్రయాణాన్ని ప్రారంభించిన రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబుకి మరోసారి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసిఏ) కార్యదర్శి బాధ్యతలు శనివారం ఏకగ్రీవంగా అప్పగించబడ్డాయి. వరుసగా రెండోసారి ఈ పదవిలో కొనసాగుతూ రాబోయే మూడేళ్లపాటు ఏసిఏకి నాయకత్వం వహించనున్నారు. మొదటి టర్మ్‌లోనే ఆయన చేసిన కృషి విశేష మైంది. మహిళా క్రికెట్‌కి ప్రోత్సాహం, గ్రామీణ ప్రతిభావంతులను గుర్తించి ఏపిఎల్ వరకు తీసుకురావడం, విశాఖ స్టేడియాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు తీర్చిదిద్దడం, అంతర్జాతీయ మ్యాచ్‌లను ఆ వేదికకు తీసుకురావడం వంటి విజయాలు ఆయన నాయకత్వానికి నిదర్శనాలు. ఈ కృషికి బీసీసీఐ నుంచి ప్రశంసలు లభించాయి. కార్యదర్శి జయ్ షా ప్రత్యేకంగా అభినందించారు. ఇదే సమయంలో, అమరావతి స్టేడియం నిర్మాణంపై ఆయన చేస్తున్న కృషి రాష్ట్ర క్రికెటర్లలో కొత్త ఆశలు నింపింది. ఈ నేపథ్యంలో జరిగిన తాజా ఏసిఏ ఎన్నికల్లో సానా సతీష్ బాబు విజయం సునాయాసమని అందరూ భావించినట్టుగానే, ఆయన ఏకగ్రీవంగా మరోసారి కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆంధ్ర క్రికెటర్ అసోసియేషన్ కార్యదర్శిగా ఎన్నికైన రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబును సాన సతీష్ బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్, చింతపల్లి అర్జున్ తో పాటు కాకినాడకు చెందిన క్రికెట్ అభిమానులు, తూర్పుగోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు, క్రికెట్ అభిమానులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## సత్కళావాహినిలో ఘనంగా భాగవత సప్తాహం ముగింపు ఉత్సవం



**కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ :** స్థానిక సత్కళావాహినిలో ఇ.వి. కృష్ణమాచార్యులు సమక్షంలో యతీంద్ర సేవాసమితి వారి నిర్వహణలో గత వారం రోజులనుండి జరుగుతున్న భాగవత సప్తాహం ముగింపు ఉత్సవం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 5 గంటల నుండి శ్రీకృష్ణ జన్మాష్టమి కార్యక్రమాలు, 14 పిండివంటల నివేదన, భక్తులచే శ్రీకృష్ణ గానామృతం, సత్కళావాహిని బృందంచే కృష్ణ గీతాలాపన జరిగినది. సత్కళావాహినిలో 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు మానికిరెడ్డి హెల్త్‌కేర్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా పలువురికి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో సత్కళావాహిని సభ్యులు అందరూ పాల్గొన్నారు.

## ఘనంగా అటల్ బిహారీ వాజ్పేయి వర్ధంతి



**చింతూరు, మేజర్ న్యూస్ :** చింతూరు మండల కేంద్రంలోని శనివారం బిజెపి పార్టీ ఆధ్వర్యంలో చింతూరు రాజీవ్ గాంధీ సెంటర్లో మాజీ ప్రధానమంత్రి భారతరత్న, అటల్ బిహారీ వాజ్పేయి వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి చింతూరు మండల అధ్యక్షులు బట్ట లక్ష్మయ్యరాజు ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జమాల్ ఖాన్, మండల సీనియర్ నాయకులు ఎండి జాంగిర్, మాజీ మండల అధ్యక్షులు ఇల్లా చిన్నారెడ్డి, బిజెపి నాయకులు నామా శ్రీనివాస్, భాస్కర్, శివాజీ, టిడిపి నాయకులు పొదిల రామారావు, శ్రీరామ్, జనసేన పార్టీ మండల అధ్యక్షులు మడివి రాజు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

# నిమజ్జనోత్సవానికి సత్యానంద సరస్వతి స్వామీజీకి ఆహ్వానం



కాకినాడ,మేజర్‌న్యూస్ : నగర గణేష ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షులు ఎనిమిరెడ్డి మాలకొండయ్య, గౌరవ అధ్యక్షులు దూసర్ల పూడి రమణరాజు, మాజీ అధ్యక్షులు గౌరవ సలహాదారు దువ్వూరి సుబ్రహ్మణ్యం, జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ నారాయణాచార్యులు నేతృత్వంలోని బృందం కలిసి శనివారం సత్యానంద సరస్వతి స్వామీజీని తునిలో ఆయన తపోవనంలో కలిసి కాకినాడలో సెప్టెంబరు 6, 7 తేదీలలో జరగనున్న సామూహిక గణపతి విగ్రహాల నిమజ్జనోత్సవానికి విచ్చేయవలసిందిగా ఆహ్వానించడం జరిగింది. సమితి ఆహ్వానంపై స్పందించిన సత్యానంద సరస్వతి స్వామీజీ తాను ఆరవ తేదీ వరకు దీక్షలో ఉండగలనని, ఏడవ తేదీన నిమజ్జనోత్సవానికి వచ్చే విషయం పరిశీలిస్తానని సమితి ప్రతినిధులకు తెలియజేయడం జరిగింది. స్వామీజీని కలిసిన వారిలో సమరసత సేవ ఫౌండేషన్ ప్రతినిధి కరెడ్ల చక్రి కూడా ఉన్నారు.

గణేశ నవరాత్రి ఉత్సవాలు ఆగస్టు 27వ తేదీ నుంచి ప్రారంభమై సెప్టెంబర్ 4 తేదీతో ముగియనున్నాయి. 5వ తేదీన శుక్రవారం కావడంతో గణనాయకుని ప్రతిమలను పందిళ్ళ నుంచి తొలగించే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో 6, 7 తేదీలలో గణేశ నిమజ్జనోత్సవాలు జరగవలసి ఉన్నది. అయితే 7వ తేదీన చంద్రగ్రహణం ఉన్న నేపథ్యంలో 7వ తేదీ మధ్యాహ్నంలోగా నిమజ్జోత్సవాలను పూర్తి చేసుకోవాల్సిన అవసరం ఉన్నది. సాంప్రదాయాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ నిమజ్జనోత్సవాన్ని 37 సంవత్సరాలుగా చక్కగా నిర్వహిస్తున్న సమితి ప్రతినిధులను సత్యానంద సరస్వతి స్వామీజీ అభినందించారు.

నగర గణేష్ ఉత్సవ సమితి జిల్లా ప్రతినిధి బృందం గత మూడు రోజులుగా కాకినాడ నగరంలో వివిధ ప్రాంతాలను, కాకినాడ రూరల్ , పెద్దాపురం, తుని, జగ్గంపేట, పిఠాపురం, పత్తిపాడు, అన్నవరం, గొల్లప్రోలు ప్రాంతాలను పర్యటిస్తూ స్థానిక గణేశ ఉత్సవాల నిర్వాహకులతో నిమజ్జనోత్సవాలను సామూహికంగా నిర్వహించాల్సిన అవసరాన్ని వివరించడం జరుగుతోంది. అదేవిధంగా పందిరి నిర్వాహకులు గణేశ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని, పందిళ్ళలో సినిమా పాటలు వంటివి కాకుండా భక్తి ప్రధాన పాటలకు ప్రాధాన్యతను ఇవ్వాలని, అదేవిధంగా డీజీ సౌండ్ సిస్టంను అనుమతించిన మోతాదులో మాత్రమే వినియోగించాలని, అదేవిధంగా ఉత్సవాల నిర్వహణ మరియు నిమజ్జనోత్సవ సందర్భంగా 'మద్యం' కు దూరంగా ఉండాలని పందిరి నిర్వాహకులకు వివరించడం జరిగింది. అదేవిధంగా జిల్లా కలెక్టర్ షాన్ మోహన్‌ను సమితి ప్రతినిధులు ఇప్పటికే కలిసి చవితి ఉత్సవాలు నిమజ్జనోత్సవానికి సంబంధించి సన్నాహక సమావేశాన్ని అధికారులు, సమితి ప్రతినిధులతో ఏర్పాటు చేయవల సిందిగా అభ్యర్థించగా ఈ నెల 18వ తేదీన సన్నాహక సమావేశం ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తామని జిల్లా కలెక్టర్ సమితి ప్రతినిధులకు తెలియపరచడం జరిగింది. దీనిలో భాగంగా జిల్లా జాయింట్ కలెక్టర్ ఇప్పటికే కాకినాడ రూరల్ ప్రాంతం సూర్యాపేటలో సమితి ప్రతినిధులు, ఇతర అధికారులతో కలిసి సమీక్షించారు. సమితి పదాధికారులు జిల్లా ఎస్పీని సైతం ఇప్పటికే కలవడం జరిగింది.

జిల్లాలో పరిపూర్ణానంద స్వామీజీతో సహా ఇతర స్వామీజీలను కలిసి వారిని కూడా నిమజ్జోత్సవాలకు ఆహ్వానించడం జరుగుతుందని, సమితి ప్రతినిధులు ఎనిమిరెడ్డి మాలకొండయ్య, దూసర్లపూడి రమణ రాజు, దువ్వూరి సుబ్రహ్మణ్యం, చిట్నీడి శ్రీనివాస్, రంబాల వెంకటేశ్వరరావులు తెలియజేశారు. అదేవిధంగా సమితి స్థానిక ప్రతినిధులు ఈ ప్రాంతానికి ఆ ప్రాంతంలో ఉన్న అపార్ట్మెంట్ వాసులను కలసి అపార్ట్మెంట్ స్టీల్ట్ ఫ్లోర్లలో సామూహికంగా ఉత్సవాలు నిర్వహించుకోవాలని తద్వారా వివిధ వర్గాలలో సోదర, సోదరి భావం, చిన్నారుల్లో దైవచింతన, దేశభక్తి చిన్నతనం నుండి అలవాడతాయని వివరించడం జరుగుతోంది.


# మన్యం కవి నూనె రమేష్‌కు తెలుగు భాషా దినోత్సవ సంబరాలకు ఆహ్వానం

**చింతూరు, మేజర్ న్యూస్ :** శ్రీశ్రీ కళావేదిక నిరంతర సాహితీ, సాంస్కృతిక క్రతువులో భాగంగా తెలుగు భాషా, తెలుగు సాహిత్యం, తెలుగు కళలు, తెలుగు సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా సాహిత్య ప్రభంజనం సృష్టిస్తూ వందలాది సాహితీ కార్యక్ర మాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శ్రీశ్రీ కళావేదిక ఆగస్టు 31-2025 ఆదివారం - కొత్త రఘు రామయ్య కాలేజీ ఆడిటోరియం- నరసరావుపేట- పల్నాడు జిల్లా లో తెలుగు భాషా దినోత్సవ సంబరాలకు మన్యం కవి నూనే రమేష్‌కు ఆహ్వానం అందినట్లు తెలిపారు. వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని తెలుగు సాహిత్య సేవలను గుర్తించి



తెలుగు భాషా పరిరక్షణలోచేస్తున్న కృషికి గుర్తింపుగా పల్నాడు జిల్లా -నరసరావుపేటలో జరిగే తెలుగుభాషా దినోత్సవ సంబరాలులో "తెలుగు తేజం" తెలుగు భాషా సేవా పురస్కారానికి ఎంపిక చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనుటకు ఆహ్వానం అందటం పట్ల నూనె రమేష్ మరియు స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. తెలుగు భాషా దినోత్సవ సంబరాలు విజయవంతం కావాలని అభిలషించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పించిన శ్రీశ్రీ కళావేదిక ఛైర్మెన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, మహిళా అధ్యక్షురాలు జి.ఈశ్వరి భూషణంకు ధన్యవాదములు తెలియజేసారు.

# ప్రగతిలో కృష్ణాష్టమి కోలాహలం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కృష్ణాష్టమి సందర్భంగా ప్రగతి విద్యాసంస్థల ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు వినూత్న రీతిలో నిర్వహించారు. విద్యాసంస్థల ఛైర్మన్ పూర్ణచంద్రరావు, డైరెక్టర్ హిమబిందుల స్వీయ పర్యవేక్షణలో శ్రీకృష్ణ రాధా వేషధారణలో చిన్నారుల ప్రదర్శన అందరిని అలరించింది. డైరెక్టర్ హిమబిందు మాట్లాడుతూ పండుగల సంస్కృతి సంప్రదాయాలను చిన్నారులకు పరిచయం చేసే కార్యక్రమంలో భాగం గా ఇటువంటి వేష ధారణ పోటీలను నిర్వహిస్తూ ఉంటామన్నారు. పేరెం ట్స్ కూడా హిందూ పండుగల విశిష్టతను పిల్లలకు అలంకరణ రూపం లో ముస్తాబు చేయడం ద్వారా పిల్లలకు కూడా పండుగలు వాటి భావ ము అర్థం చేసుకోవడానికి వీలుంటుంది అన్నారు. చిన్నపిల్లలకు శ్రీ కృష్ణ రూపము బాలికలకు రాధా వేషము వేయడం, ఉట్టిని కొట్టే వేడుకను కూడా పిల్లలతోనే నిర్వహించడం జరిగిందని హిమబిందు తెలిపారు. విద్యతోపాటు పండుగల ధర్మాన్ని కూడా బోధించడం వల్ల నేటి తరానికి ఎంతో ఉపయోగపడుతుందన్న అభిప్రాయంతో పేరెంట్స్ సహకారంతో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. టీచర్స్ కూడా ఎంతో శ్రద్ధతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయ డానికి కృషి చేశారని వారందరినీ హిమబిందు అభినందించారు. విజేతలందరికీ హిమబిందు చేతులు మీదుగా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్.వి.వి.ఎస్.లక్ష్మితో టీచర్స్ పాల్గొన్నారు.

## భవిష్యత్ తరాలకు స్వాతంత్ర్య ఫలాలను అందించాలి- జమ్మి



**రాజమండ్రి, మేజర్ న్యూస్ :** స్థానిక ఆంధ్ర కేసరి సెంటినరీ జూనియర్ కళాశాలలో 79వ స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాల గౌరవ కార్యదర్శి జమ్మి రామారావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ స్వాతంత్ర్య ఫలాలను అనుభవిస్తున్న మనమంతా ప్రజాస్వామ్య స్వాతంత్ర్య భారతదేశంలో ఉగ్రవాద కార్యకలాపాలను చేస్తున్న వారి దుష్కృత్యాలను అంతము చేస్తూ శత్రుదేశాలకు సవాల్ విసురుతున్న భారత ప్రభుత్వం సైనిక సోదరుల పట్ల కృతజ్ఞతతో మెలుగుతూ హక్కులు బాధ్యతలు పట్ల గుర్తెరిగి వ్యవహరించాలన్నారు. త్యాగధనులను స్మరించుకుంటూ భవిష్యత్ తరాలకు స్వాతంత్ర ఫలాలను అందించాలని ఆయన కోరారు. కులమత బేధాలు లేకుండా ప్రతి భారతీయుడు గర్వంగా జరుపుకునే జాతీయ పండుగ ఆగస్టు 15 అని ఆయన ప్రస్తావించారు. భారతదేశ ప్రధాని చేస్తున్న అనేక కార్యక్రమాల వల్ల ప్రపంచంలోనే భారతదేశం అగ్ర భాగాన నిలవడానికి ఎంతో కాలం పట్టదని జమ్మి రామారావు అన్నారు. భారతదేశంలో నేడు జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని, ముఖ్యంగా దేశ ప్రజల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సహకారం మరువలేనిదని ఆయన కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ముఖ్యమంత్రి పేరున స్థాపించబడిన విద్యా సంస్థ ఆదర్శప్రాయమైన విద్యా విధానాన్ని కొనసాగిస్తూ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు అధ్యాపకులు ఎంతో కృషి చేస్తున్నారని జమ్మి రామారావు ప్రశంసించారు. వైఎస్ నరసింహారావు చూపిన మార్గంలో పయనిస్తూ ఆయన ఆలోచనకు అనుగుణంగా విద్యాసంస్థను నిర్వహిస్తున్నామని స్మరించుకున్నారు. కార్యక్రమంలో ఆంధ్ర కేసరి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఛైర్మన్ జమ్మి పూర్ణచంద్రరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.సుబ్రహ్మణ్యేశ్వరి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## జనసంద్రంగా వాడపల్లి వెంకన్న క్షేత్రం

**- భక్తవత్సలుడుకు భక్తుల నీరాజనాలు**





**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** కలియుగ వైకుంఠం వాడపల్లి వెంకటేశ్వర స్వామివారికి శనివారం భక్తులు నీరాజనాలు సమర్పిం చారు. ఉదయం వేకువజామునే సుప్రభాత సేవ అనంతరం స్వామివారికి నీరాజనం మంత్రపుష్పం తదితర పూజా కార్యక్రమాలు అర్చక స్వాములు అంగరంగ వైభవంగా నిర్వహించి తనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. రాష్ట్ర నలుమూల నుండి కాలినడకన వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు ఏర్పాటును పూర్తి చేసి పర్యవేక్షించారు. ప్రసాద వితరణ అన్నదానం నిర్వహించారు. ఆర్టీసీ అధికారులు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏలేశ్వరం, ఏలూరు, రాజమహేంద్రవరం, గోకవరం, విజయవాడ, విశాఖపట్నం నుండి ప్రత్యేక బస్సులు నడిపారు. వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సీఐ విద్యాసాగర్ ఎస్సై ఎస్. రాము తన సిబ్బందితో ప్రతిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. శనివారం స్వామివారి ఆదాయం రూ.60 లక్షలు సమకూరింది.

# ఘనంగా ముగిసిన పరిషత్ భజన పోటీలు


**– పలువురు భజన కళాకారులకు సన్మానం**





**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండలం దివిలి గ్రామంలో శ్రీ కటకం అన్నబ్బాయి గారి రైస్‌మిల్ వద్ద శ్రీ వరలక్ష్మీదేవి ఉత్సవ కమిటి సభ్యుల ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేది ప్రారంభమై 15వ తేది వరకు పరిషత్ భజన పోటీలు శ్రీ విఘ్నేశ్వర భజన కళాకారుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు మరియు శ్రీ వరలక్ష్మీ దేవి ఉత్సవ కమిటి సభ్యులు బండారు మంగబాబు ఆధ్వర్యంలో జరిగిన నేపధ్యంలో గురువారం పరిషత్ భజన పోటీలు ఘనంగా ముగిసాయి. శుక్రవారం ఈ పరిషత్ భజన పోటీలుకు కవిశేఖర నీలం శ్రీను న్యాయనిర్ణేతగా వ్యవహరించి, ఈ పరిషత్ భజన పోటీలులో గెలుపొందిన భజన కళాకారులకు అతిధుల చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. మహిళా విభాగంలో ఉత్తమ హార్మోనిస్ట్‌గా రమణ (కాట్రావులపల్లి), ఉత్తమ డొలకిస్ట్‌గా సింగంపల్లి సాయి (మర్లావ), ఉత్తమ గాయకురాలు సింగిరెడ్డి వీరవేణి (యండపల్లి), ప్రధమ బహుమతి యండపల్లి సామిరెడ్డి బుజ్జి బృందం, ద్వితీయ బహుమతి కాట్రావులపల్లి వీరవేణి బృందం, తృతీయ బహుమతి మర్లావ కామన స్వామి బృందం, పురుషుల విభాగంలో ఉత్తమ హార్మోనిస్ట్‌గా సత్తిబాబు తామరాడ, ఉత్తమ డొలకిస్ట్‌గా తేజ వెల్దుర్తి, ఉత్తమ కాయకునిగా నాని వెల్దుర్తి, ప్రధమ బహుమతి పరిజల్లిపేట సూర్యచక్రం బృందం, ద్వితీయ బహుమతి చదలాడ కోట శ్రీనివాసరావు బృందం, తృతీయ బహుమతి పాలచర్ల సుబ్బారావు బృందాలు గెలుపొందినట్లు న్యాయ నిర్ణేత ప్రకటించారు. వీరికి షీల్డ్, నగదు బహుమతులు ముఖ్య అతిధుల చేతుల మీదుగా అందజేశారు. దీనిలో భాగంగా ముందుగా సీనియర్ భజన కళాకారులు దుర్గాడ శ్రీరాములు అనే రామారావు శ్రీమతి నూకరాజు దంపతులను నిర్వాహకులు, శ్రీ విఘ్నేశ్వర భజన కళాకారుల సంక్షేమ సంఘం సభ్యులు ఘనంగా సత్కరించారు. శ్రీ వరలక్ష్మీ ఉత్సవ కమిటి సభ్యుల చేతుల మీదుగా పలువురు భజన కళాకారులను సన్మానించారు. ఈ సందర్భంగా ప్రముఖ వ్యాపారవేత్త కటకం శ్రీరామమూర్తి, పలువురు మాట్లాడుతూ వరలక్ష్మీదేవి వ్రతం పురస్కరించుకుని ఇటువంటి అధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడంలో బండారు మంగబాబు ఎంతో అభినందనీయుడని, ఇటువంటి వ్యక్తి ప్రతీపల్లెలో ఉంటే ఆధ్యాత్మికత పెంపొందించే అవకాశం ఉంటుందని, శ్రీ విఘ్నేశ్వర భజన కళాకారుల సంక్షేమ సంఘంలో ముఖ్య భూమిక పోషించడంలో మంగబాబు సేవలు ఎనలేనివని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ విఘ్నేశ్వర భజన కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు యడవిల్లి సూర్యచక్రం, ఉపాధ్యక్షులు ఇనుగంటి రామకృష్ణ, సెక్రటరీ గడపా శివబాబు, జాయింట్ సెక్రటరీ పచ్చిపాల ప్రసాదరావు, కోశాధికారి పంచాది రామకృష్ణ, గౌరవాధ్యక్షులు పోతుల వీరన్న చౌదరి, మావిరెడ్డి నెహ్రూ, సంఘ వ్యవస్థాపకులు ఎలిశెట్టి కామరాజు, కామన స్వామి, రాధాకృష్ణ మహిళా భజన సమాజం సభ్యులు, గ్రామ నాయకులు, భక్తులు, పరిసర గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఇండిపెండెన్స్ డే ఉత్తమ సేవా అవార్డు అందుకున్న అధికారులు



**పెరవలి, మేజర్ న్యూస్ :** విధినిర్వహణలో అంకితభావంతో పనిచేస్తున్న పలువురు అధికారులు ఉత్తమ సేవా అవార్డులను అందుకున్నారు. 79 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర పర్యాటక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్,కలెక్టర్ పి ప్రశాంతి చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారాన్ని పెరవలి మండలం పశు వైద్యాధికారి డాక్టర్ వానపల్లి చరణ్ ఫణీంద్ర అందుకున్నారు ఈయన ప్రస్తుతం పెరవలి పశువైద్యాధికారిగా పనిచేస్తున్నారు.

అదేవిధంగా పెరవలి మండల పరిషత్‌లో సీనియర్ అసిస్టెంట్ పనిచేయుచున్న శంకర్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా చైర్ పర్సన్ గంటా పద్మశ్రీ చేతుల మీదుగా ఉత్తమ సేవా అవార్డు అందుకున్నారు, పెనుగొండ మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేయుచున్న పెరవలి మండలం ముక్కామల గ్రామానికి చెందిన అరిగెల వేణుగోపాలరావు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా చైర్పర్సన్ గంట పద్మశ్రీ చేతుల మీదుగా ఉత్తమ సేవా అవార్డు అందుకున్నారు.ఈ సందర్భంగా వీరందరికీ పెరవలి పరిధిలోని వివిధ కార్యాలయాల సిబ్బంది నాయకులు హర్షం వ్యక్తంచేశారు.

# పేదల పక్షాన పోరాడే ఏకైక పార్టీ సిపిఐ

**– జిల్లా మహా సభలో సిపిఐ కార్య దర్శి రామకృష్ణ**




**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** సిపిఐపార్టీ అల్లూరి సీతారామరాజు జిల్లామహా సభలు శనివారం రంపచోడవరంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా సిపిఐ పార్టీ నాయకులు, కార్యకర్తలు మధ్యాహ్నం ఫారెస్ట్ చెక్ పోస్ట్ నుండి భారీ ర్యాలీగా అంబేద్కర్ సెంటర్ మీదుగా సభా ప్రాంగణానికి చేరుకున్నారు. అనంతరం స్టేట్ బ్యాంకు వద్ద భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు.ఈసభకు ముఖ్య అతిధిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ హాజరయ్యారు. జిల్లా మహా సభలకు జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ముందుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ఎండ గట్టారు. పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కారం చూపడం లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ప్రధాని మోడీ ఇద్దరూ విఫలం చెందారన్నారు. త్వరలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం తానే స్వయంగా ఈ ప్రాంతంలో పోరాటం చేస్తున్నట్లు అయన ప్రకటించారు.గిరిజన ప్రజలు సమస్యలు అంటే ప్రభుత్వాలకు పట్టడం లేదని ఎంతసేపు మోడీ కార్పొరేట్‌ల సేవలోనే తరిస్తూ అంబానీ, అదానీలకు దేశ సంపద దోచి పెడుతున్నారన్నారు. దేశంలో వందేళ్ల చరిత్ర కలిగిన పార్టీ సిపిఐ, కాంగ్రెస్ పార్టీలు మాత్రమే అని తాము పేద ప్రజల పక్షాన పోరాటం చేస్తున్నామని, అందుకే పేద ప్రజలు, కార్మికులు, కర్షకులు ఎర్ర జెండా వెంటే ఉంటారని అన్నారు. ఒంగోలులో లక్షలాదిమందితో రాష్ట్ర మహాసభలు జరుపడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర హోమ్ మంత్రి ఎప్పుడు మావోయిస్టులను అంతం చేయడమే ఎజెండా అంటూ వరుస ఎన్‌కౌంటర్‌లు చేస్తున్నారని, గిరిజన ప్రజల సమస్యలపై ఎప్పుడైనా మాట్లాడారా అని ప్రశ్నించారు. రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ ప్రజల బాగోగులు కోసం పోరాటం చేసే ఏకైక పార్టీ సిపిఐ అని, రైతుల పక్షాన అనేక పోరాటాలు చేసామని, పోలవరం సమస్యలపై అనేక పోరాటాలు చేస్తూనే ఉన్నామన్నారు. జిల్లా మహాసభలో రాష్ట్ర కార్య వర్గం సభ్యులు డేగ ప్రభాకర్, జాతీయ సమితి సభ్యులు తాటిపాక మధు, జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రంపచోడవరం డివిజన్ కార్యదర్శి జుత్తుక కుమార్, మహిళా నాయకురాలు దుర్గ, అల్లూరి జిల్లా 23 మండలాల నుండి సిపిఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## ఘనంగా జిల్లా టిడిపి విభిన్న ప్రతిభవంతుల అధ్యక్షులు మండపాక అప్పన్న దొర పుట్టిన రోజు వేడుకలు

**– హాజరై ఆశీస్సులు అందించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ**



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా టిడిపి విభిన్న ప్రతిభ వంతుల అధ్యక్షులు మండపాక అప్పన్నదొర పుట్టినరోజు వేడుకలు అంగరంగ వైభవంగా శనివారం ఘనంగా నిర్వహించారు. జగ్గంపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జీను మణిబాబు ఆధ్వర్యంలో స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి టీటీడీ బోర్డు మెంబర్, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా పాల్గొని కేకును కట్ చేసి వినిపించారు.నెహ్రూ గారి ఆశీర్వాదాలు అప్పన్న దొర పొందాడు. ఈ సందర్భంగా అప్పన్న దొర మాట్లాడుతూ చిన్న కార్యకర్త నుంచి నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ గా, కాకినాడ జిల్లా విభిన్న ప్రతిభవంతుల అధ్యక్షులుగా నన్ను నియమించిన తన ఆరాధ్య దైవం జ్యోతుల నెహ్రూ గారికి, యువనేత, యంగ్ అండ్ డైనమిక్ లీడర్ జ్యోతు నవీన్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. యువ కార్యకర్తలకు మార్గదర్శి నిగా నిలిచిన మండల అధ్యక్షులు జీను మణిబాబుకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ డైరెక్టర్ మారిశెట్టి భద్రం, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, టౌన్ టిడిపి అధ్యక్షులు పాండ్రంగి రాంబాబు, నియోజవర్గ యువత అధ్యక్షులు దేవరపల్లి మూర్తి, నియోజకవర్గ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు వేములకొండ జోగారావు, మండల యువత అధ్యక్షులు రాయి సాయి, నియోజవర్గ యువత ఉపాధ్యక్షులు బద్ది సురేష్, దాపర్తి సీతారామయ్య, తాళ్లూరు సర్పంచ్ ఎస్ వీరబాబు, కొంద్రోతు శ్రీను, తూము కుమార్, కుర్ల చిన్నబాబు, కొత్త ప్రసాద్, కాళ్ల వెంకటేష్, కోడూరి రమేష్, గొల్లపల్లి శ్రీదేవి, షేక్ వల్లి, య ద్రంశెట్టి మణికంత, దార బల్ల గోవిందు, సద్గురు మూర్తి అధిక సంఖ్యలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## ఆగస్టు 18 సోమవారం -పీజీఆర్ఎస్ కార్యక్రమం యథాతథంగా

**– 1100 కాల్ సెంటర్ ద్వారా ఫిర్యాదుల పరిష్కార వేదిక**
**– 9552300009 వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సేవలు అందుబాటులో – కలెక్టర్ పి.ప్రశాంతి**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి నెలా నిర్వహించే పీజీఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార) కార్యక్రమం ఈ నెల ఆగస్టు 18వ తేదీ సోమవారం యథావిధిగా నిర్వహించబడుతుందని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ శ్రీమతి పి. ప్రశాంతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో జరుగుతున్న పీజీఆర్ఎస్‌లో ప్రజలు తమ అర్జీలను డివిజన్, మండల కేంద్రాల కార్యాలయాల్లోనే అర్జీలను సమర్పించవచ్చని తెలిపారు. జిల్లా కేంద్రానికి ప్రత్యేకంగా రావాల్సిన అవసరం లేకుండా స్థానికంగా అధికారులు సేవలు అందిస్తారని, అందువల్ల ప్రజలకు సమయం మరియు ఖర్చు ఆదా అవుతుందని ఆమె తెలిపారు.

అర్జీల స్వీకరణ ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు జరుగుతుంది. ప్రజలు "మీ కోసం" 1100 కాల్ సెంటర్ ద్వారా కొత్త ఫిర్యాదులు నమోదు చేయడంతో పాటు, ఇప్పటికే నమోదు చేసిన ఫిర్యాదుల పరిష్కార స్థితిని కూడా తెలుసుకోవచ్చని తెలిపారు. అలాగే వాట్సాప్ గవర్నెన్స్ నంబర్ 9552300009 ద్వారా పౌర సేవలు పొందవచ్చని, ఈ నంబర్‌ను తమ సెల్‌ఫోన్లలో సేవ్ చేసుకోవాలని సూచించారు. నేరుగా హాజరు కాలేకపోయిన వారు meekosam.ap.gov.in పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో అర్జీలు నమోదు చేసుకునే వీలుందని తెలిపారు. ప్రజలు ప్రభుత్వం అందిస్తున్న ఈ వినూత్న మాధ్యమాలను ఉపయోగించి తమ సమస్య లను పరిష్కరించు కోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

# ప్రతిభలో వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సామర్లకోట లోని ప్రతిభ విద్యా నికేతన్ పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను పురస్కరించుకొని శుక్రవారం నిర్వహించిన వేడుకలను పాఠశాల కరస్పాండెంట్ ఎస్. వి. వి. జి. ప్రకాష్ మరియు డైరెక్టర్ సుధారాణి ప్రకాష్ దంపతులు జ్యోతిప్రజ్వలనలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులు, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక, సాంప్రదాయ బృందావన నృత్యాలు శ్రీకృష్ణుడు, రాధ,గోపికల వేషధారణలతో వచ్చిన విద్యార్థులు అందరినీ ఆనందడోలికల్లో ముంచెత్తి, భక్తిపారవశ్యంతో పరవశులను గావించారు. ఈ వేడుకలను పురస్కరించుకొని ప్రకాశ్ సభనుద్దేశించి ప్రసంగిస్తూ " శ్రీకృష్ణుడు ప్రేమ–ఆప్యాయతలకు, దీనజనోద్ధరణకు, దుష్టశిక్షణ–శిష్టరక్షణలకు ప్రతిరూపమని మరియు మానవులు సమాజంలో ఏవిధంగా బాధ్యత తో మెలగాలో తన గీతోపదేశంద్వారా అర్జునికి తెలియచేస్తున్నట్లు మనకు అన్యోపదేశంగా సూచించాడని అందుకే అందరూ శ్రీకృష్ణుడు చెప్పినట్లు చెయ్యాలనే విషయం నానుడి గా సమాజంలో ప్రతీతి అయిందని తెలియచెప్పారు. ఈ వేడుకల నిర్వహణ సందర్భంగా విద్యార్థులకు, ఉపాధ్యాయులకు యాజమాన్యం అల్పాహారాన్ని సమకూర్చింది. ఈ వేడుకల సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన భగవద్గీత శ్లోకము ల పఠనము, డ్రాయింగ్ లాంటి వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. విద్యార్థులే ఈ వేడుకలను ఆధ్వర్యంచేసి, చక్కగా నిర్వహించడం అందరికీ విస్మయాన్ని కలిగించింది. చివరగా 10వతరగతి విద్యార్థులతో ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహణతో వేడుకలు ముగిసాయి. ఈ వేడుకలలో ప్రిన్సిపాల్ టి.సునీత, వైస్–ప్రిన్సిపాల్ పి.శ్రీగౌరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అత్యంత ఉత్సాహంతో పాల్గొని, కార్యక్రమాలను వీక్షించి జయప్రదం చేశారు.

# ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు





**కాకినాడ, మేజర్న్యూస్ :** స్థానిక నాగమల్లితోట జంక్షన్లో జెఎన్టియుకె ఎదురుగా గల గ్రౌండ్స్లో ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రబోధ సేవా సమితి అధ్యక్షులు సలాది అనిల్ కుమార్, ఢిల్లీ నాయుడు, సాయి తదితరులు వేడుకల నిర్వహణ గావించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు ప్రసాద వితరణ గావించారు. సాయంత్రం చిన్నారుల రాధాకృష్ణుల వేషధారణతో పాటు ఆటపాటలు, భగవద్గీత పారాయణ జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీసీసీబీ బ్యాంక్ చైర్మన్ తుమ్మల రామస్వామి, మాజీ మంత్రి వర్యులు చిక్కాల రామచంద్ర రావు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి రవికిరణ్, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షులు చిలుకూరి రాంకుమార్, రంబాల వెంకటేశ్వరావు, జనసేన నాయకులు చిక్కాల దొరబాబు, నులుకుర్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## అన్నవరప్పాడు సొసైటీ అధ్యక్షుడిగా పొప్పుప్పు నాగేశ్వరరావు ప్రమాణ స్వీకారం

**పెరవలి, మేజర్ న్యూస్ :** అన్నవరప్పాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా ఆగస్టు 15వ తేదీ శుక్రవారం అన్నవరప్పాడు గ్రామానికి చెందిన జనసేన నాయకులు పొప్పొప్పు వెంకట నాగేశ్వరరావు పదవి ప్రమాణ స్వీకారం చేశారు ఆయనతోపాటు క్రీమ్ కమిటీ సభ్యులు కూడా ప్రమాణ స్వీకారం చేశారు ఈ కార్యక్రమంలో పెరవలి మండల జనసేన నాయకులు పెప్పర రవికుమార్, అన్నవరప్పాడు గ్రామ జనసేన పార్టీ అధ్యక్షులు పి సూర్య నాగేశ్వరరావు, ఎంపిటిసి ఆకుల సుబ్బరాయుడు ఇతర కూటమి నాయకులు పాల్గొన్నారు.

# రైతన్నతో ప్రయాణించిన ఎమ్మెల్యే

– "అన్నదాత సుఖీభవ" భారీ ట్రాక్టర్ ర్యాలీ



**అనపర్తి, మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా రైతన్నలకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా లబ్ది చేకూరినందుకు రైతులు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ దాదాపుగా 300 ట్రాక్టర్స్ తో కొమరిపాలెం నుండి అనపర్తి గాంధీ బొమ్మ సెంటర్ వరకు వయా బలభద్రపురం మీదుగా అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, యువ నాయకులు నల్లమిల్లి మనోజ్ రెడ్డి ఆధ్వర్యంలో ట్రాక్టర్స్తో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఒక్కొక్క హామీని నెరవేర్చుకుంటూ వెళుతుందని, దానిలో భాగంగానే అధికారంలోకి వచ్చిన 15 రోజులకే వృద్ధాప్య, వికలాంగ పింఛన్లను పెంచి ప్రతినెలా లబ్ధిదారులకు సక్రమంగా అందేలా చేస్తుందన్నారు. తల్లికి వందనం కార్యక్రమం అమలు చేసి ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లుల ఖాతాలో 13 వేల చొప్పున జమ చేస్తూ మరో రెండు వేలు పాఠశాల అభివృద్ధి నిమిత్తం స్కూల్ అకౌంట్లో వేయడం జరిగిందని అన్నదాత సుఖీభవ పథకం అమలులోకి తీసుకువచ్చి ఏదైతే కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకంలో ఆరువేల రూపాయలు జమ చేస్తుందో దానికి మరో 14 వేల రూపాయలు కలిపి మొత్తం 20 వేల రూపాయలను మూడు విడతల కింద రైతులు ఖాతాలోకి జమ చేయడం ప్రారంభించింది. ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని అన్నారు.అదేవిధంగా కేవలం సంక్షేమం తోనే సరిపెట్టకుండా గాడి తప్పిన రాష్ట్ర అభివృద్ధిని తిరిగి పట్టాలెక్కిస్తూ అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. అభివృద్ధిని సంక్షేమాన్ని రెండు కళ్ళుగా భావిస్తూ కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని . అన్నారు. ప్రజల్లోకి వచ్చి మాట్లాడే సత్తా లేని నాయకులు నాలుగు గోడల మధ్య కూర్చుని సోలో వీడియోలు చేసుకుంటూ కాలం గడుపుతుంటారు. ఆయన నాపై చేసిన ఆరోపణలలో ఒక్కటి నిరూపించగలిగిన నేను నా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తాను నిరూపించలేక పోతే మీరు రాజకీయ సన్యాసం చేస్తారా అని నేను సవాలు విసిరితే ఇంతవరకు ఆయన నుండి జవాబు లేదన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ట్రాక్టర్లతో వచ్చిన రైతులందరికీ కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో అనపర్తి నియోజకవర్గం ఎన్డీఏ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## ఈ నెల 10 నుండి 22 వరకు ఘనంగా మెగాస్టార్ జన్మదిన మహోత్సవాలు



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** రాజమండ్రి పరిసర ప్రాంతాలలో పద్మవిభూషణ్ డా.మెగాస్టార్ చిరంజీవి జన్మదిన మహోత్సవాలు రాష్ట్ర చిరంజీవి యువత ప్రధాన కార్యదర్శి ఏడిద బాబీ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీ నుండి 22వ తేదీ వరకు నిర్వహించబడనున్నాయి. అందులో భాగంగా శనివారం రాజమండ్రి రూరల్, కలెక్టర్ ఆఫీస్ వెనుక రాజీవ్ నగర్ వద్ద "మొక్కలు నాటే కార్యక్రమం" నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పాల్గొని కార్యక్రమం ప్రారంభించారు. విశిష్ట అతిధిగా అనుశ్రీ సత్యనారాయణ పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, సినిమా థియేటర్స్ దగ్గర పూల అభిషేకాలు చేసి సినీ అభిమానులను సామాజిక సేవ రక్తదానం మరియు ఇతర కార్యక్రమల వైపు మరలించిన గొప్ప నాయకుడు కొణిదెల చిరంజీవి అని కొనియాడారు. ఈ కార్యక్రమం నిర్వహించిన విజ్జన శివకి కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో మచ్చేటి ప్రసాద్, చప్పు చిన్నారావు, పందూరి అప్పారావు, సిఐ గణేష్, ఎమ్మార్వో శ్రీనివాస్, ఈవో వెంకట్ రావు తదితరులు మరియు భారీ సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

## ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న సిసి కరెడ్ల రాజా



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ ఆథారిటి చైర్మన్ సిసిగా విధులు నిర్వహించిన పెద్దాపురం పట్టణానికి చెందిన కరెడ్ల రాజా 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కౌడా కార్యాలయం నందు డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాల చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా రాజాను పలువురు అభినందించారు.

## డిప్యూటి సిఎం చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న ఆర్డీఓ శ్రీరమణి



**పెద్దాపురం,మేజర్ న్యూస్ :** విధుల నిర్వహణలో ఉత్తమ సేవలు కనబరిచిన ఒడుకు గాను 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శుక్రవారం కాకినాడ పోలీస్ పరేడ్ గ్రౌండ్లో నిర్వహించిన వేడుకలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్కళ్యాణ్ పాల్గొన్న కార్యక్రమంలో పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణికి ఉత్తమ సేవా పురస్కారం అందజేశారు. జిల్లా కలెక్టర్ సగిలి షాన్మోహన్, జిల్లా ఎస్పి జి.బిందుమాధవ్, పలువురు జిల్లా అధికారులు, తదితరులు ఉన్నారు.

## వైజ్ సిబిఓ సంస్థ సేవలపై అవగాహన



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో గల వైజ్ సిబిఓ సంస్థ నందు శుక్రవారం 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెద్దాపురం ప్రభుత్వాసుపత్రి ప్రధాన వైద్యురాలు ఉమ మహేశ్వరి పాల్గొని, వైజ్ సిబిఓ అందించే సేవల గురించి, హెచ్ఐవి, ఎయిడ్స్పై అవగాహన కలిగి ఉండాలని వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐసిటిసి కౌన్సిలర్ బి.శ్రీనివాస్, విహెచ్ఎస్ సిబ్బంది, వైజ్ సిబ్బంది, కమ్యూనిటి సభ్యులు జార్జి ముల్లర్, పాల్గొన్నారు.

# భావితరాలకు స్ఫూర్తి..అణగారిన వర్గాల ఆశాజ్యోతి కీ.శే. సర్దార్ గౌతు లచ్చన్న

- రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్
- రాజమహేంద్రవరం వై జంక్షన్‌లో ఘనంగా ప్రజా బాంధవుడు గౌతు లచ్చన్న 116వ జయంతి వేడుకలు
- గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించిన మంత్రి కందుల దుర్గేష్
- బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి గౌతు లచ్చన్న జయంతి వేడుకలను జీవో నెం.83 ద్వారా అధికారికంగా నిర్వహించుకునే అవకాశం కల్పించిన సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి నారాలోకేష్‌కు ధన్యవాదాలు తెలిపిన మంత్రి దుర్గేష్
- లచ్చన్న ఆశయాల సాధనకు కృషి చేస్తున్న గౌడ, శెట్టిబలిజ సంక్షేమ సంఘాలను అభినందించిన మంత్రి దుర్గేష్



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేసి, తను నమ్మిన సిద్ధాంతం కోసం ఎక్కడా రాజీ పడకుండా బడుగు, బలహీన వర్గాలకు దిక్సూచిగా నిలిచిన సర్దార్ గౌతు లచ్చన్న స్ఫూర్తిదాయకమైన జీవిత చరిత్రను భావి తరాలకు తెలపాల్సిన అవసరముందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. స్వాతంత్ర్య సమరం, రాజకీయ ఉద్యమాల్లో కీలకంగా వ్యవహరించిన కీ.శే. సర్దార్ గౌతు లచ్చన్న 116వ జయంతి వేడుకలను పురస్కరించుకొని శనివారం రాజమహేంద్రవరం వై జంక్షన్ లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి మంత్రి కందుల దుర్గేష్ ఘన నివాళులర్పించారు.తెలుగు జాతికి గర్వకారణమైన సర్దార్ గౌతు లచ్చన్న లాంటి గొప్ప వ్యక్తి జయంతిని ఏటా అధికారికంగా నిర్వహించాలని కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమన్నారు.
ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేసిన సర్దార్ గౌతు లచ్చన్నను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.గౌతు లచ్చన్న ఆశయాలు ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేస్తున్న రాజమండ్రి గౌడ, శెట్టి బలిజ సంఘానికి అభినందనలు తెలిపారు. స్వాతంత్ర్యం ముందు, తర్వాత ప్రజలను ప్రభావితం చేసిన గొప్ప వ్యక్తి గౌతు లచ్చన్న జయంతిని జీవో నంబర్ 83 ద్వారా అధికారికంగా, రాష్ట్ర పండుగగా నిర్వహించుకునే అవకాశం కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లకు ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ ధన్యవాదాలు తెలిపారు. గౌతు లచ్చన్న పేరు వింటేనే ఉద్యమానికి నిలువెత్తు రూపంగా నిలుస్తారని మంత్రి దుర్గేష్ అభివర్ణించారు. భారతదేశ రాజకీయాల్లో సర్దార్ వల్లభాయ్ పటేల్ తర్వాత సర్దార్ బిరుదు పొందిన మహనీయులు గౌతు లచ్చన్న అని గుర్తుచేశారు.సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో 7 పర్యాయాలు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా నెగ్గారని, మంత్రిగా కూడా చేశారని వివరించారు. ప్రజల తరపున పోరాడిన ఘటనలు కోకొల్లలు అని వెల్లడించారు. కల్లుగీత కార్మికుల పక్షాన నిలబడి వారి హక్కుల సాధనకు కృషి చేశారని పేర్కొన్నారు. 96 సంవత్సరాల తన జీవిత కాలంలో రాష్ట్ర ప్రజలను ఎంతగానో ప్రభావితం చేశారని నాడు పలాసలో ఒక్కడే అఖిల భారత కిసాన్ సభను నిర్వహించి పలువురికి ఆదర్శంగా నిలిచారన్నారు. మెట్రిక్యులేషన్ చదువుతున్న సమయంలో మహాత్మా గాంధీజీ పిలుపుమేరకు ఉద్యమంలోకి అడుగుపెట్టారని, అనేక పర్యాయాలు ప్రజల కోసం జైలుకు వెళ్లారని, అలాంటి ఎందరో గొప్ప వ్యక్తుల త్యాగనిరతి వల్లే నేడు మనం స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటున్నామని మంత్రి దుర్గేష్ తెలిపారు. గౌతు లచ్చన్నను సముచితంగా గౌరవించుకునేలా సీఎం చంద్రబాబునాయుడు తీసుకున్న నిర్ణయంతో రాబోయే రోజుల్లో జయంతి వేడుకలు మరింత అద్భుతంగా నిర్వహించుకుంటామని మంత్రి దుర్గేష్ హామీ ఇచ్చారు. దేశ, రాష్ట్ర ప్రజలకు మార్గదర్శకుడైన లచ్చన్న లాంటి నాయకుడి గొప్పతనాన్ని తెలియజేసే అవకాశాన్ని పొందుతున్నామని అన్నారు. ఈ సందర్భంగా జోహార్ గౌతు లచ్చన్న అని మంత్రి కందుల దుర్గేష్ నినదించారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పంద్రాగస్టు వేడుకలు

- మాదిరెడ్డి లక్ష్మీ నరసమ్మ 75వ జన్మదినోత్సవ వేడుకల్లో భాగంగా పౌరులకు వస్త్ర సంచులు పంపిణీ



**పెరవలి, మేజర్ న్యూస్ :** 79 వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15వ తేదీ శుక్రవారం పైడిపర్రు వంటేద్దు సోమ సుందరరావు హీరో మోటార్స్ షోరూమ్ వద్ద 79 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పైడిపర్రు తేతలి లయన్స్ క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ వంటేద్దు సోమ సుందరరావు ముఖ్యఅతిథిగా విచ్చేశారు.
ఈ కార్యక్రమంలో క్లబ్బు ప్రెసిడెంట్ లయన్ కంబాల రంగారావు జాతీయ జెండా ఆవిష్కరించారు. ఫాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ లయన్ మాదిరెడ్డి బాబుజీ రావు సతీమణి లక్ష్మీనరసమ్మ 75వ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి పౌరులకు ప్లాస్టిక్ నిషేధం పై అవగాహన కల్పించి ప్లాస్టిక్ నిరోధానికి ఉపయోగపడే వస్త్ర బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లైన్ వంక రాజకుమారి, లైన్ కుదారి ఆనంద్, కుదారి సజిని, వంటెద్దు గోవిందరాజులు నాయుడు, చీర్ల వెంకటేశ్వరరావు, బసవ శ్రీనివాస్,వంటేద్దు జగదీశ్వరి, వాణి, పెరవలి లయన్స్ క్లబ్ సెక్రటరీ సలాది ఉదయభాస్కర రావు, వంటెద్దు ఈశ్వర ప్రసాద్, చిట్టూరి శ్రీనివాస్ ఇతర లైన్ మెంబర్లు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్న మంత్రి సుభాష్

- గొల్లపాలెంలో ఉట్టి కొట్టి సందడి చేసిన మంత్రి



**కాజులూరు, మేజర్ న్యూస్ :** రామచంద్రపురం నియోజవర్గం కాజులూరు మండలం గొల్లపాలెం గ్రామంలో శనివారం జరిగిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొన్నారు. మంత్రి సుభాష్ రాకతో ఆ గ్రామంలో సందడితోపాటు.. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ ఆలయం వద్ద ఏర్పాటుచేసిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో మంత్రి సుభాష్ ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. పిల్లలు, గ్రామ ప్రజలు, యువకులు, కూటమి పార్టీ నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఉట్టుకొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ ప్రజలందరికీ ఎంతో ఇష్టమైన కృష్ణాష్టమి పండుగ ఘనంగా నిర్వహించడం ఆనందకరమన్నారు. అప్పట్లో శ్రీకృష్ణుని అల్లరి తట్టుకోలేక పాలు,పెరుగు ఉట్టిలో పెట్టి చేతికి అందకుండా పైన దాచుకునేవారని, అయినా సరే తన స్నేహితులతో వెళ్ళి పాలు, పెరుగు దొంగిలించి తినేవాడని, అందుకే ఉట్టి బాగా ప్రాశస్త్యం పొందింది అన్నారు. ప్రజలంతా ఆనందంగా, సుఖ సంతోషాలతో జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అన్నారు. పిల్లల ధరించిన శాస్త్రీయ దుస్తులు, శ్రీకృష్ణ,గోపికల వేషధారణలు కనుల విందుగా ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# భజే గోవిందా.. భజే గోపాల

- వేడుకగా శ్రీకృష్ణ జన్మాష్టమి -అలరించిన ఉట్టి సంబరం



**అనపర్తి, మేజర్ న్యూస్ :** మండల వ్యాప్తంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన పొలమూరులో రుక్మిణి, సత్యభామ సమేత మదనగోపాలస్వామి ఆలయంలో కృష్ణ జన్మాష్టమి వేడుకగా జరిపారు. వైఖానస ఆగమ విధానంలో ఉదయం స్వామికి ప్రత్యేక అభిషేకం, వివిధ రకాల పుష్ప అలంకరణలతో స్వామిని ముస్తాబు చేసారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు విశేషంగా స్వామిని దర్శించుకున్నారు. ఇక సాయంత్రం ఆలయ ఆవరణలో ఉట్టి ఉత్సవం నిర్వహించారు. కర్రి వారి వంశీకులు ఉట్టి సంబరం ఏర్పాటు చేయగా గొల్ల వంశానికి చెందిన వారు ఉట్టి కొట్టి ఉత్సాహంగా వేడుకలో పాల్గొన్నారు. ఆలయ ఈవో శివ రామకృష్ణ ఆధ్వర్యంలో స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకి సేవ నిర్వహించారు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


## శృంగార వల్లభ స్వామి వారిని దర్శించుకున్న భక్తులు

- వేదపండితుల ఆధ్వర్యంలో స్వామివార్కి ప్రత్యేక అలంకరణ



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండలం, తిరుపతి గ్రామంలో వేంచేసియున్న శ్రీ శ్రీ శృంగార వల్లభ స్వామిని శనివారం వేలాది సంఖ్యలో భక్తులు దర్శించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కార్యనిర్వాహాధికారి వడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రత్యేక దర్శనం టికెట్ల ద్వారా రూ.1,47,160/–, అన్నదాన విరాళాల ద్వారా రూ.69,570/–లు, కేశఖండన ద్వారా రూ.4,080/–, తులాభారం ద్వారా రూ.300/– లడ్డూ ప్రసాదాల ద్వారా రూ.16,935/– మొత్తం రూ.2,38,045/–లు స్వామివారికి ఆదాయం రావడం జరిగిందని తెలిపారు. వేద పండితులు ఆధ్వర్యంలో స్వామివారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించడం జరిగింది. అలాగే దేవస్థానం తరపున ఉదయం పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని, స్వామి వారి ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు పెద్దింటి నారాయణాచార్యులు, ఆలయ సిబ్బంది కృష్ణ,ఇతర స్వచ్చంద సేవకులు, వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## కూనవరం, విఆర్ పురం, చింతూరు, ఎటపాక మండలాలకు స్త్రీ శక్తి బస్సులు లేక నిరాశ పడ్డ మహిళలు



**కూనవరం, మేజర్ న్యూస్ :** విలీన మండలాలలో ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు సంక్షేమ ఫలాలు ప్రజలకు చేరువ కాకపోవటంతో ఈ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. రైతు భరోసా తీసుకోవటానికి భూములు ప్రభుత్వానికి లక్ష 15 వేల రూపాయలకే అమ్మినందున ఈ ప్రాంత ప్రజలకు రైతు భరోసా ప్రభుత్వం నిరాకరించింది అదేవిధంగా ఆగస్టు 15వ తేదీన నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్, మరియు నారా లోకేష్, ఎంతో ప్రతిష్టాత్మకంగా మహిళలకు ఆర్టీసీ ద్వారా రాష్ట్రంలో ఐదు సర్వీసులు ఉచితంగా తిరిగేందుకు స్త్రీ శక్తి పథకాన్ని ప్రారంభించి మహిళలందరికీ ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం జరిగింది. దానికి రాష్ట్రమంతా మహిళలు కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తూ అభినందనలు కూడా తెలియజేస్తున్నారు అయితే పోలవరం విలీన మండలా లైన వీఆర్ పురం, కూనవరం, ఎటపాక, చింతూరు, మండలాలకు ఈ సౌకర్యం లేక స్త్రీలు ఇబ్బందికి గురవుతున్నారు. ఇదేమిటి అని అడిగితే ఇవి అంతర్రాష్ట్ర సరిహద్దులు కాబట్టి మీకు ఉచితం లేదు అని ఆర్టీసీ కండక్టర్లు డ్రైవర్లు తెలియజేస్తున్నారు. ఈ ప్రాంత కూటమి నాయకులు స్థానిక ఎమ్మెల్యే శిరీష దేవిని కలిసి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు.